కథా నిలయం
శ్రీకాకుళం

# అనివి

నా అంత దురదృష్టవంతుడు ఉండడేమో అనిపిస్తుంటుంది. అలా అని అదృష్టం నా జోలికి రాలేదని కాదు, హిట్ అండ్ రన్‌లా తగిలి వెళ్ళిపోతుంటుంది.

చిన్నప్పటి నుండి కష్టాల్లోనే పెరిగాను. మేం ఆరుగురం పిల్లలం. మమ్మల్ని పెంచి, చదివించి పెద్ద చేయడానికి అమ్మానాన్నలు చాలా కష్టాలు పడ్డారు. నాన్న ప్రభుత్వంలో చిన్న ఉద్యోగం చేస్తున్నా, అమ్మ టీచర్‌గా చేసినా నెల చివరికి వచ్చేసరికి ఇంట్లో బియ్యం ఉండేది కాదు. 'ఈ సాయంత్రం మనందరం మంచినీళ్ళు తాగి పడుకుందాం', నవ్వుతూ

అనేది అమ్మ. అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళలో నీటి అలలు కదిలేవి. నాన్న మావంక నిస్సహాయంగా చూసేవాడు. మా చిన్న చెల్లెలు మటుకు ఆకలితో కొద్దిసేపు ఏడ్చి ఊరుకుండిపోయేది.

పట్టా పుచ్చుకున్నాక ఉద్యోగం వేటలోపడ్డాను. ఎక్కువ శ్రమపడకుండా ఉద్యోగం దొరికింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగమే. అయితే రాష్ట్రానికి దూరంగా పోస్టింగ్ ఇచ్చారు. వెళ్ళి చేరాను. జీతం ఎక్కువేం కాదు. సర్దుకుంటూ మూడొంతుల్లో ఒకవంతు ఇంటికి పంపించేవాడిని.

ఇరవయ్యొనిమిదో ఏడు దాటినప్పుడు నాకు ప్రమోషన్ రావడం, రాష్ట్రానికే పోస్టు చేయబడడం జరిగాక నా దృష్టి పెళ్ళి మీదకు జరిగింది. ఇలా సంవత్సరాలు ఇంటికి దూరంగా ఉండడం వలనో, ఏమో అందరి పట్టింపులకు దూరమయ్యాను. నా పెళ్ళి తప్ప అందరి పెళ్ళిళ్ళూ అయిపోయాయి. ఆనవాయితీగా నాకు శుభలేఖలు పంపించారు గాని వివరాలు ఏం చెప్పలేదు. నా లోపం ఏమిటో గాని నా మీద గౌరవం ఎవరికీ ఉన్నట్టు అనిపించలేదు. ఇంటి పరిస్థితి మారిపోయింది. అమ్మా నాన్నా పదవీ విరమణలు చేశారు. అద్దెకు ఉంటున్న ఇంటినే కొనుక్కున్నారు. నాలుగు గదులు వేశారు. నేను అక్కడ ఉన్నంతకాలం నా పడక వరండాకే పరిమితమయ్యేది. నామీద నాకే విసుగుపుట్టేది. నాలుగయిదుసార్లు మా ఇంటికి వెళ్ళాక ఇహ రావడం అనవసరం అనిపించింది. ఉద్యోగం చేస్తున్న ఊరినుండి మా ఊరు వెళ్ళడం మానేశాను. డబ్బులు పంపించడం మానేశాక మా నాన్న అయిదారుసార్లు నాకు ఫోన్లు చేసి 'డబ్బులు పంపించడం లేదేమిట్రా?' అని అడిగేవాడు. 'నాకే చాలడం లేదు. మీకెలా పంపించేది?' అంటూండేవాడిని. ఫోన్ చేసినప్పుడల్లా డబ్బులు గురించే అడిగేవాడు. 'పంపిస్తాను' అనేవాడిని కాని పంపేవాడిని కాదు. అందుకు కోపంగా ఏమో నా పెళ్ళి విషయం పట్టించుకోవడం మానేశాడు. పండగలకూ, శుభకార్యాలకు నన్ను పిలవడం మానేశాడు. అందరూ ఉండి కూడా ఏకాకినయిపోయాను. మరొక ప్రమోషన్ వచ్చింది. వయసు ముదురుతుంది.

ఈ మధ్యలో నాకు కాంతిలాల్‌తో పరిచయం అయింది. అతనికి నా వయసు ఉంటుంది. అతని వృత్తిరీత్యా మా ఆఫీసులో పనుండి వారం పది రోజులకయినా ఒకసారి వస్తుండేవాడు. మా పరిచయం స్నేహంగా మారింది. అతనికి జ్యూవలరీ

షాప్ ఉంది. ఎందుచేతనో ఏమో దాన్ని సరిగ్గా ఉంచేవాడు కాదు. నగలు షోకేసుల్లో ఎక్కువగా ఉండేవి కావు. ఉన్నవి కూడా గిల్టునగల్లా అనిపించేవి. గల్లాపెట్టె ముందు ఒక్కడే దిగాలుగా కూర్చుని ఉండేవాడు. వ్యాపారంలో నష్టపోయి ఉండాలి అనుకునే వాడిని తప్ప అతని విషయాలు అడగలేదు. తను చెప్పలేదు.

ఒక సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి తిరిగి వెళ్తున్నప్పుడు అతను తన దుకాణం బయట నిలబడి ఉన్నాడు. పలకరించగానే "మీ కోసమే ఎదురుచూస్తున్నాను రండి. కొద్దిసేపు దుకాణంలో కూర్చుందాం" అన్నాడు.

అతని దుకాణంలో గల్లాపెట్టె ముందు ఎదురెదురుగా కూర్చున్నాం. దుకాణం మటుకు ఖాళీ అయింది. మూసేస్తున్నట్టు అనిపించింది.

"కెన్యా వెళ్ళిపోతున్నాను" అన్నాడు.

ఎందుకని నేనడగలేదు.

బాధగా నవ్వి, "ఈ ఊరు నాకెందుకో అచ్చిరాలేదు. అప్పుల పాలు కాలేదు కాని ఎక్కడ చేయిపెడితే అక్కడ నష్టం వచ్చింది" అన్నాడు.

"కెన్యాలో ఎవరున్నారు?"

"నా దూరపు బంధువు ఉన్నాడు. డైమండ్ వ్యాపారం చేస్తుంటాడు. నా కష్టాలన్నీ చెపితే తన దగ్గరకు వచ్చేయమన్నాడు. టికెట్ అతనే పంపాడు. పేపర్లన్నీ తయారయ్యాయి. వచ్చే ఆదివారమే నా ప్రయాణం. అక్కడ కాలు నిలదొక్కుకున్నాక భార్యాపిల్లలను తీసుకువెళ్తాను. ఇంతకాలం ఇక్కడ ఉండి ఇక్కడ నుండి వెళ్ళడం బాధగానే ఉంది. ప్చ్... తప్పదు... అక్కడ నా పరిస్థితి బాగయి బాగా సంపాయిస్తే తిరిగి ఇక్కడకు వచ్చేస్తాను" అని నా చేయి తన చేతిలోకి తీసుకుని నా చేతిలో బ్రాస్‌లెట్ పెట్టి, "ఇది నా గుర్తుగా ఉంచుకోండి..." వద్దు వద్దంటుంటే, "నాకెవరో రెండు మూడు సంవత్సరాల కిందట ఇచ్చారు. దీన్నెప్పుడూ తొడుక్కోలేదు... ప్లీజ్ మీ దగ్గర ఉంచుకోండి. నేను తిరిగి వచ్చాక మీ దగ్గరనుండి తప్పక తీసుకుంటాను. అంతవరకయినా భద్రంగా ఉంచండి" అన్నాడు.

కాదనలేకపోయాను. బ్రాస్‌లెట్ మరీ తేలికగా లేదు. "జేబులో వేసుకోబోతుంటే, "వద్దు. ఇలా ఇవ్వండి" అందుకుని నా కుడిచేతికి తొడిగాడు. అంత వదులుగా లేదు. బిగుతుగా లేదు. ఊడిపోకుండా లాక్ చేశాడు. బ్రాస్‌లెట్ వేసుకోవడం నాకు

అదే మొదటిసారి. చిన్నదయినా బరువుగా ఉన్నట్టు అనిపించింది.

ప్రతిగా ఏమయినా ఇద్దామనిపించింది. డబ్బులివ్వటం బావుండదు. "ఉండండి ఇప్పుడే వస్తాను" అక్కడకు అరకిలోమీటర్ దూరంలో ఉన్న గడియారాల షాప్‌కు వెళ్ళి మంచి చేతి గడియారం కొని కాంతిలాల్ దుకాణానికి వచ్చాను. కాంతిలాల్ కనబడలేదు. దుకాణం మూసి తాళం వేసి ఉంది. అతని ఇల్లు ఎక్కడో నాకు తెలియదు. పక్క దుకాణదార్లను అడిగాను. తమకూ తెలియదన్నారు. నిరుత్సాహపడ్డాను.

ఇంటికి చేరుకుని దుస్తులు మార్చుకోబోతూ పంట్లాం జేబులోంచి పర్సు బయటకు తీస్తుంటే పర్సుతోపాటు అయిదు వందల రూపాయల కట్ట, రబ్బరుబేండుతో చుట్టి ఉన్నది, బయటకు వచ్చింది. యాభయివేల రూపాయలు. ఎవరో పొరపాటున నా జేబులో పెట్టే అవకాశమే లేదు. ఆఫీసులోంచి బయటపడేముందు పర్సు బయటకు తీసి అనవసరమైన కాయితాలు చెత్తబుట్టలో వేసి తిరిగి పర్సు జేబులో పెట్టుకున్నప్పుడు ఆ డబ్బు లేదు. గడియారాల షాపులో క్రెడిట్ కార్డునే ఉపయోగించాను. దారిలో ఎవరితోనూ మాట్లాడలేదు. తెలియని వాళ్ళెవరూ నన్ను రాసుకుంటూ పోలేదు. ఆ డబ్బు ఎక్కడినుండి వచ్చినట్టు? ఆలోచించే కొద్దీ నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

అసలవి మంచినోట్లా, దొంగనోట్లా అని కట్టలో అక్కడక్కడా ఉన్న నోట్లు తీసి పరిశీలించాను. అవి దొంగనోట్లు కావు. మంచివే. సంతోషం కన్నా భయం ఎక్కువ కాసాగింది. వాటినేం చేయాలి? ఎంతసేపు ఆలోచించినా జవాబు దొరకలేదు.

భోజనానికి బయటకు వెళ్తూ కాంతిలాల్ దుకాణం మీదగానే వెళ్ళాను. దుకాణం మూసే ఉంది. ఖరీదయిన హొటల్‌కు వెళ్ళి చాలా రోజుల తర్వాత నాకు ఇష్టమయినవి తెప్పించుకుని తిన్నాను. ఇంటికొచ్చి జేబులోంచి పర్సు బయటకు తీస్తుంటే పర్సుతోపాటు మరో అయిదు వందల రూపాయల కట్ట బయటకు వచ్చింది. మంత్రపు కిటుకుకు ఆశ్చర్యం నన్ను ముంచెత్తుతోంది. నోట్లకట్టలు బల్లమీద పెట్టి ఇంకో నోట్ల కట్ట వస్తుందేమోనని పర్సు జేబులో పెట్టుకుని బయటకు తీశాను. డబ్బులేమీ రాలేదు. మనసు చివుక్కుమంది. ఇహ రావా? ఎంత మాయగా వచ్చాయో అంత మాయగా పోతాయా?

పడుకున్నానన్న మాటేగాని వెంటనే నిద్రపట్టలేదు. రెండుమూడుసార్లు

మంచం దిగి బీరువా తెరిచి లాకర్‌లో దాచిన డబ్బు చూసుకున్నాను. భద్రంగా ఉన్నాయి. తెలతెలవారుతుండగా నిద్రపట్టింది. నిద్రలేవగానే బీరువా డబ్బు చూసుకున్నాను. పెట్టినచోట కాక మూలకు జరిగినట్టుగా ఉన్నాయి. లేక నాకు అలా అనిపించిందా?

ఇంట్లో ఉంచడం మంచిది కాదనిపించి తీసుకువెళ్ళి మా ఆఫీసుకు సంబంధించిన క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్‌లో వేసాక గాని నా మనసు నెమ్మదించలేదు. ఆఫీసులో పనిచేస్తున్నా నా ఆలోచనలన్నీ బేంకులో వేసిన లక్ష రూపాయల మీదే కదులాడాయి. ఆఫీసులో ఉండగా నా జేబులోంచి పర్సు బయటకు తీయలేదు. జేబులో చేయి పెట్టడానికి భయపడ్డాను. సాయంత్రం ఇంటికి చేరుకుని జేబులో చేయిపెట్టి పర్సు బయటకు తీస్తుంటే మరో అయిదువందల రూపాయల కట్ట వచ్చింది. రాత్రి భోజనం చేసి వచ్చాక మరో కట్ట వచ్చింది. అనుభవపూర్వకంగా నాకు అర్థమయ్యిందేమిటంటే రోజుకు లక్ష రూపాయలే వస్తాయి, అదీ రెండు దఫాలుగా, ఇంట్లో ఉన్న సమయంలోనే.

పదిరోజులు తిరగకుండా మంచి కారు కొన్నాను. ఆ కారులోనే మా ఊరు వెళ్ళేసరికి మా వాళ్ళు నామీద ఎక్కడలేని ప్రేమ కురిపించారు. పట్టినంత మందిని కూర్చోబెట్టుకుని ఊరంతా తిప్పాను. నాలా మా ఊరంతా హఠాత్తుగా మారిపోయినట్టు అనిపించింది. మా వాళ్ళు నామీద ఎక్కడలేని ప్రేమ కురిపించారు. నాన్న చేతిలో రెండు లక్షలు పెట్టేసరికి నా పెళ్ళి విషయం ఎత్తి ఏవేవో సంబంధాలు చెప్పాడు. 'మీ ఇష్టం' అన్నాను. అప్పటికప్పుడే ఫోన్లో ఎవరెవరితోనో మాట్లాడాడు. సాయంత్రానికల్లా ఇంటికి చేరుకున్నాను.

డబ్బు రావడం ఆగలేదు. అయిదు నెలలయ్యాక పెద్ద ఇల్లు, ఇంట్లోకి అవసరమైన ఖరీదయిన వస్తువులు, ఫర్నిచర్ కొన్నాను. ఏ విషయంలోనూ కొదవంటూ ఏర్పడడం లేదు. డబ్బు బ్యాంకులో పెడితే ఆదాయపు పన్నువాళ్ళ దృష్టిలో పడతానని ఇంట్లోనే భద్రంగా దాచాను.

ఏ చీకూ చింతా లేకుండా జీవితం గడిపేస్తున్న సమయంలో కారులో వెళ్తున్న నాకు ప్రమాదం జరిగింది. స్పృహ కోల్పోయాను. నన్ను ఆస్పత్రిలో ఎవరు చేర్పించారో, ఎవరు ఆపరేషన్ చేశారో ఏవీ గుర్తులేవు. ఆస్పత్రి నుండి బయటకు వచ్చిన రోజున గమనించాను. నా బ్రాస్‌లెట్ లేదు. ఆస్పత్రికి వెళ్ళి నర్సులనూ,

డాక్టర్లనూ ఎవరినడిగినా మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు.

నా చేయి నయం కాకమునుపే షార్ట్‌సర్క్యూట్ వలన నా ఇల్లు తగలబడి బూడిదయింది. ఇంట్లో నేను దాచుకున్న డబ్బు ఎలా వచ్చిందో అలా పోయింది. నోట్లన్నీ కాలిపోయాయి. షేర్ మార్కెట్ కూడా నన్ను ముంచేసింది. నేను ధనవంతుడిని అవడానికి, బికారిని కావడానికి కారణం బ్రాస్‌లెట్టా? అది తీసుకున్నవాడు నాకు ఇప్పుడు. తీసుకుని లాక్‌చేస్తే ఊడిరాదు. అదృష్టం దారి తప్పింది.

మునుపటిలా ఇప్పుడు నా దగ్గరకు ఎవరూ రావడం లేదు. పలకరింపులూ కరువయినాయి. నిశ్చయమయిన పెళ్ళి ఆగిపోయింది. నాన్న ముఖం చాటేశాడు. ఎప్పుడు కాంతిలాల్ తిరిగి వచ్చి తన బ్రాస్‌లెట్ తిరిగి ఇవ్వమని గొంతుమీద కూర్చుంటాడో? అతని దుకాణం అలానే ఉంది. ఈ మధ్యనే దానికి రంగులు వేశారు. అతను తిరిగి వస్తున్నాడా అని ఎవరినయినా అడగడానికి కూడా భయం వేస్తోంది.

*'విశాలాక్షి' సాహిత్య మాసపత్రిక, ఆగస్టు-2014*